

తడిసిన ధాన్యం కొనాలి

రామగుండం: తడిసిన ధాన్యాన్ని కొనాలని కోరుతూ అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు రైతుకూలీ సంఘం ప్రతినిధులు గురువారం వినతిపత్రం అందించారు.



రైల్వే క్రాసింగ్ వద్ద మరమ్మతులు

పెద్దపల్లిరూరల్: అందుగులపల్లి–దేవునిపల్లి రైల్వేక్రాసింగ్ గేట్ 44 వద్ద మరమ్మతు పనులు చేపట్టారు. ఈనెల 6 వరకు రాకపోకలు నిలిపివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
33.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం స్వల్పంగా ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలి వేగంగా వీస్తుంది.

న్యూస్‌రీల్

విద్యుత్ పొదుపుపై అవగాహన



రామగుండం: విద్యుత్ వినియోగంలో భద్రత, పొదుపు చర్యలు పాటిస్తే ఆర్థిక ప్రయోజనాలు చేకూరుతాయని ఎన్పీడీసీఎల్ ఏడీఈ రాజ్‌కుమార్, రామగుండం ఏఈ బేతి దామోదర్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో గురువారం విద్యుత్ భద్రత, పొదుపుపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏడీఈ, ఏఈ మాట్లాడుతూ తెగిపడిన విద్యుత్ తీగలు, విరిగిన విద్యుత్ స్తంభాలను తాకరాదన్నారు. అనుమతిలేని వ్యక్తులు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌ల ఫ్యూజ్‌లు మార్చటం, సర్వీసు తీగలను సవరించడం చేయొద్దని సూచించారు. రోజుకొక యూనిట్ విద్యుత్ ఆదా చేస్తే జీవితకాలంలో లక్ష రూపాయలు ఆదా చేసినట్లేనని పేర్కొన్నారు.

మిల్లు కార్మికుల బకాయిలు ఇప్పించండి



రామగుండం: అంతర్గాం టెక్స్‌టైల్ కార్మికుల బకాయిలు ఇప్పించాలని కోరుతూ మిల్లు కార్మికుల వారసులు బర్మా కాందీశీకులు గురువారం ఇండస్ట్రియల్ పార్క్ వద్ద ధర్నా చేశారు. ఈనెల 8న అంతర్గాంలో ఇండస్ట్రియల్ పార్కును ఐటీశాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో వీరు ధర్నాకు దిగారు. బకాయి పరిహారం, నివేశన స్థలాలు ఇప్పించాలని కోరారు. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

జీడీకే–5 ఓసీపీలో ప్రత్యేక బృందం పర్యటన



పరిశీలిస్తున్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–5 ఓసీపీలో బ్లాస్టింగ్ సమయంలో యాజమాన్యం తీసుకుంటున్న చర్యలను గురువారం ప్రత్యేక బృందం పరిశీలించింది. బ్లాస్టింగ్ సమయాన్ని పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఆర్‌అండ్‌డీ జీఎం సుభానీ, సూరత్కల్ సీట్ ప్రొఫెసర్ కర్ర వెంకట్‌రెడ్డి, గని మేనేజర్ అనిల్‌గబాలే, సేఫ్టీ ఆఫీసర్ పి.శ్రీనివాస్, బ్లాస్టింగ్ ఇన్‌చార్జి జి.రాములు, సీనియర్ సర్వే ఆఫీసర్ ఎండీ అలీ, అడిషనల్ మేనేజర్ కట్ట శ్రీధర్ ఉన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న వీవోఏలు

పెద్దపల్లిరూరల్: మహిళా గ్రామైక్య సంఘాలను బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న వీఓఏల కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అరవింద్, రాములు, రాజేశ్వరి, రజిత, స్వప్న, ప్రేమలత, రవి, శివలీల, స్వప్న, మేఘమాల, స్వరూప, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితుల ధర్నా

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): పాలకుర్తి మండలం ఎల్కలపల్లిలోని ఓ మాజీ ప్రజాప్రతినిధి ఇంటి ముందు ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితులు గురువారం ధర్నాకు దిగారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ ఫ్యాక్టరీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ గోదావరిఖనికి చెందిన పలువురి వద్ద నగదు తీసుకున్నాడని బాధితులు తెలిపారు. ఉద్యోగం నుంచి తొలగించడంతో తీసుకున్న డబ్బు చెల్లించాలని దళారీని ఆశ్రయించారు. దీంతో సదరు మాజీ ప్రజాప్రతినిధి తీసుకున్న నగదును చెల్లిస్తామని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా పట్టించుకోకపోవడంతో గురువారం ధర్నా చేపట్టారు. అయితే సదరు ప్రజాప్రతినిధి ఇంట్లో లేకపోవడంతో చేసేదేమీ లేక బాధితులు ధర్నా విరమించుకొని వెళ్లిపోయారు.

గుండె ఆగుతోంది

- ఆందోళన కలిగిస్తున్న గుండె సంబంధిత సమస్యలు
- సాధారణ పరీక్షల్లో బయట పడుతున్న వైనం
- అప్రమత్తత అవసరమంటున్న వైద్య నిపుణులు

‘పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన ఓ యువకుడు(35) ప్రైవేట్ కంపెనీలో సేల్స్‌మెన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. చూసేందుకు ఆరోగ్యంగా కనిపించే అతను హఠాత్తుగా గుండెపోటుకు గురయ్యాడు. ఆస్పత్రికి తరలిస్తుండగానే ప్రాణాలు వదిలాడు.’

‘రామగుండంకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి(36) ఇటీవల హఠాత్తుగా చెమటలు పట్టడం.. చాతిలో బరువుగా అనిపించడంతో ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకున్నాడు. వైద్యులు మేజర్ హార్ట్‌ఎటాక్‌గా గుర్తించి ఎమర్జెన్సీగా యాంజియోగ్రామ్ చేసి స్టంట్ వేశారు. అతనికి ఎలాంటి దురలవాట్లు లేవు. అప్పటి వరకు పూర్తి ఆరోగ్యంతో ఉన్నారు.



ఇటీవల గుండె సమస్య ఉన్నట్లు గుర్తించిన వారు..

ఆస్పత్రి విభాగం	వయస్సు	రోగుల సంఖ్య
ఆరోగ్యశ్రీ	20–45	15
ఆర్‌బీఎస్‌కే	10–18	70

సాక్షి, పెద్దపల్లి: ముప్పై పదుల వయస్సు కూడా నిండని యువకులు గుండెపోటుకు గురవుతున్నారు. మారుతున్న ఆహారపు అలవాట్లు.. జీవనశైలి.. శారీరకశ్రమ లేకపోవడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. అప్పటి వరకు ఆరోగ్యంగా ఉన్న వారికి హఠాత్తుగా చెమటలు పడుతుండడం.. ఆస్పత్రిలో సాధారణ పరీక్షలు చేయించుకునే సమయంలో గుండె సమస్యలు బయటపడుతున్నాయి. జిల్లాలో ఇటీవల గుండెపోటు మరణాలు పెరగడం కలవరం పెడుతోంది. సాధారణ పరీక్షలు చేయించుకుంటున్న సమయంలో గుండె సమస్యలు బయటపడుతున్నాయి. ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల్లో 20–45 ఏళ్లలోపు వారు ప్రతీ నెల 15మందికి పైగా చేరుతున్నారు. ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో 10–18 ఏళ్ల వారికి పరీక్షలు చేయగా.. 70 మందికి సమస్య ఉన్నట్లు గుర్తిస్తున్నారు. ప్రైవేట్‌కు వెళ్తున్న వారి సంఖ్య అదనం. ఈ గణాంకాలను పరిశీలిస్తే గుండె సమస్యలతో బాధపడుతున్న వారు అధికంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

అవగాహన లేక ప్రాణాలమీదకి..

- హఠాత్తుగా గుండె స్తంభించడం(కార్డియాక్ అరెస్ట్), గుండెపోటు(హార్ట్‌ఎటాక్)లు వేర్వేరు సమస్యలు. గుండె పనితీరు అస్తవ్యస్తమై హఠాత్తుగా కొట్టుకోవడం ఆగిపోతే కార్డియాక్ అరెస్ట్ అంటారు. కార్డియాక్ అరెస్ట్ అయితే రక్తాన్ని పంప్ చేసే ప్రక్రియ దెబ్బతింటుంది. సమస్య వచ్చిన కొద్ది నిమిషాల్లోపు చికిత్స అందిస్తే కోలుకునే అవకాశం ఉంటుంది.
- 108కి కాల్ చేయడంతోపాటు అందుబాటులో ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫ్రిబిలేటర్(ఏఈడీ) ఉపయోగించాలి. దీన్ని చాతికి తాకిస్తే గుండెకు విద్యుత్‌షాక్ తగిలి కొట్టుకుంటుంది. ఏఈడీ అందుబాటులో లేకుంటే కార్డియో పల్మనరీ రిససిటేషన్(సీపీఆర్) చేయాలి.
- హార్ట్‌ఎటాక్ అంటే గుండె సంబంధించి రక్తనాళాల్లో బ్లాక్ ఏర్పడి రక్తసరఫరా నిలిచిపోతుంది. చాతిలో నొప్పి, చెమటలు పట్టడం, ఆయాసం వస్తుంటుంది. ఇలాంటి పరిస్థితిలో వెంటనే దగ్గరిలో ఉన్న హాస్పిటల్‌కు తరలించి ఈసీజీ, ప్రాథమిక పరీక్షలు చేసి సకాలంలో వైద్యం అందిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చు. కార్డియాక్ అరెస్ట్ మాదిరిగా హార్ట్ ఎటాక్‌లో గుండె ఆగిపోదు. పనిచేస్తూనే ఉంటుంది. తక్షణమే ఆసుపత్రికి తరలిస్తే కాపాడుకోవచ్చు.

ఇవీ కారణాలు

- మధుమేహం, అధిక రక్తపోటు, ధూమపానంతో రక్తం గడ్డకడుతుంది.
- గుండె కండరాలు మందపడి ఆకస్మిక గుండెపోటు సంభవిస్తుంది. దీన్నే కార్డియోమయోపతి అంటారు.
- కండలు పెంచేందుకు వాడే మాదకద్రవ్యాలు, ఎన్‌బాలిక్ స్టెరాయిడ్స్‌తో గుండె స్పందనలో తేడాలు వస్తాయి.
- సిక్స్ ప్యాక్ దేహం కోసం ప్రొటీన్ ఎక్కువ మోతాదులో తీసుకోవడం ప్రధాన సమస్య.
- బరువు తగ్గేందుకు వాడే మందులు గుండె కొట్టుకోవడాన్ని దెబ్బతీస్తాయి.

ఆహార అలవాట్లపై శ్రద్ధ పెట్టాలి



చాలా మంది ఆహారపు అలవాట్లపై శ్రద్ధ చూపడం లేదు. గుండెపోటు, బీపీ, షుగర్‌తోపాటు అనేక వ్యాధులకు గురవుతున్నారు. మద్యం, సిగరెట్లు తాగడం, చిన్న చిన్న సమస్యలకు మానసిక ఒత్తిడికి గురవడం కూడా గుండెపోటు వచ్చే అవకాశాలు ఉన్నాయి. చాతిలో నొప్పి, అలసట, బీపీ పెరిగితే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. సొంత వైద్యం చేసుకోవద్దు. చాలామంది గుండెపోటును కూడా ఎసిడిటీ అనుకోని మందులు కొని వేసుకుంటున్నారు. ఇలా కొందరు ప్రాణాలు కూడా కోల్పోయారు. సకాలంలో డాక్టర్‌ను సంప్రదించాలి.

– టీవీ రాజేశేఖర్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్, గోదావరిఖని

వెళ్లిన పదిరోజులకే..



భార్య సౌజన్య, పిల్లలతో..



మల్కాపూర్‌లోని అనిల్ ఇంటి వద్ద విషాదంలో బంధువులు

- తొలి ప్రయత్నంలో జాబ్ కొట్టిన అనిల్
- అందరితో కలివిడిగా ఉంటాడని పేరు
- అనిల్ మృతితో గ్రామంలో విషాదఛాయలు
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబం
- దీనంగా చూస్తున్న మృతుడి కుమారులు
- ఇంటికి భారీగా చేరుకున్న బంధువులు

బోయినపల్లి(చొప్పదండి): జమ్ముకాశ్మీర్‌లోని ఓ నదిలో హెలికాప్టర్ కూలిపోయి మండలంలోని మల్కాపూర్‌కు చెందిన ఆర్మీ జవాన్ పబ్బాల అనిల్(29) మృతిచెందాడన్న విషయం మండలంలో దావనంలా వ్యాపించింది. నిరుపేద కుటుంబానికి చెందిన పబ్బాల మల్లయ్య, లక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులు. అనిల్ పదో తరగతి గంగాధర ప్రైవేటు పాఠశాలలో.. ఇంటర్ కరీంనగర్‌లో పూర్తి చేశాడు. డిగ్రీ వరకు చదువుకున్న అనిల్ సుమారు 11 ఏళ్ల క్రితం ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో పాల్గొని తొలి ప్రయత్నంలోనే జాబ్ సాధించాడు. ప్రస్తుతం జమ్మూకాశ్మీర్‌లో ఆర్మీ సీఎఫ్‌ఎస్ విభాగంలో ఏవీఎస్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. ఉద్యోగంలో చేరిన రెండేళ్లకు కోరెంకు చెందిన సౌజన్యతో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు అయాన్(6), అరయ్(3). తన అత్తగారి ఊరైన కోరెంలో ఇటీవల బీరప్ప పట్నాలు వేసుకోగా అనిల్ హాజరయ్యాడు. అందరితో కలిసి సుమారు పది రోజుల పాటు ఆనందంగా గడిపాడు.

కుమారుడి పుట్టిన రోజు వేడుకలు

40 రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చిన అనిల్.. ఇటీవలే చిన్న కుమారుడు అరయ్ మూడో పుట్టినరోజును ఘనంగా నిర్వహించాడు. తండ్రి మల్లయ్య అనారోగ్యంతో బాధపడుతుంటే ఆసుపత్రిలో చూపించాడు. పదిరోజుల క్రితం తిరిగి విధులకు బయల్దేరాడు. అంతలోనే అనుకోని ప్రమాదం జరిగి మృతిచెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఇదే ఘటనలో హెలికాప్టర్‌లో ఉన్న మరో ఇద్దరు కూడా మృతిచెందినట్లు సమాచారం. అనిల్‌కు ఇద్దరు సోదరులు (శ్రీనివాస్, మహేందర్) ఉన్నారు. వీరు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. తల్లి లక్ష్మి గతంలో గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. తండ్రి మల్లయ్య ప్రస్తుతం అనారోగ్యంతో ఉన్నాడు. అనిల్ మరణవార్త తెలుసుకున్న బంధువులు, స్నేహితులు ఆయన ఇంటికి భారీగా చేరుకున్నారు. తల్లి ఏడుస్తుంటే ఏమీ తెలియని ఆ చిన్నారులు బిక్కుబిక్కుమంటూ చూస్తుండడం పలువురిని కంటతడి పెట్టించింది.

ఆర్మీకి వెళ్లాలని అనిల్ కోరిక

అనిల్‌కంటే ముందు గ్రామానికి చెందిన మెట్ట కుమార్ మొదట ఆర్మీలో చేరాడు. మరోవ్యక్తి అకెన అనిల్ కూడా ఆర్మీలో చేరడంతో ఎలాగైనా ఆర్మీలో చేరాలని అనిల్ భావించాడు. అనిల్‌కు చిన్నప్పటి నుంచే సైనికుడిని కావాలనే కోరిక ఉండేదని ఆయన సోదరుడు శ్రీనివాస్ చెప్పాడు.

‘బండి’, ‘బోయినపల్లి’ పరామర్శ

అనిల్ మృతిచెందిన విషయం తెలుసుకున్న కరీంనగర్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఫోన్‌లో మాట్లాడారు. అనిల్ కుటుంబసభ్యులను ఓదార్చారు. మృతుడి కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంతిమసంస్కారాలకు ఏర్పాట్లు చూడాలని స్థానిక నాయకులకు సూచించారు. అనిల్ మృతి పట్ల రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సంతాపం ప్రకటించారు.

ముగిసిన ‘ముస్కాన్’ పరిశీలన



ఆస్పత్రి వైద్యులతో సమావేశమైన ఢిల్లీ ప్రతినిధులు

కోల్‌సిటీ(రామగుండం): ముస్కాన్ పథకం ఎంపికలో భాగంగా రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో ఢిల్లీ బృందం పరిశీలన రెండో రోజు గురువారం కొనసాగింది. నవజాత శిశుమరణాల రేటును తగ్గించడం, శిశువైద్య సేవలను మెరుగుపర్చడమే ఈ పథకం లక్ష్యం. ఇందులో భాగంగా రామగుండం జీజీహెచ్ ఆస్పత్రిని ఢిల్లీ బృందం సభ్యులు వైద్యులు ముస్తఫా యూనస్, వందనసైనీ సందర్శించారు. గురువారం పిల్లల వార్డు, ప్రసూతీ వార్డులను పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న వైద్యసేవలు, రికార్డులను తనిఖీ చేశారు. బాలింతలు, పిల్లల తల్లిదండ్రులు, బంధువులతో మాట్లాడి.. వైద్యసేవలపై ఆరా తీశారు. అన్ని విభాగాల్లో 75 శాతానికి పైగా స్కోర్ చేసిన ఆస్పత్రిని ముస్కాన్‌కు ఎంపిక చేస్తారని పరిశీలన బృందం సభ్యులు తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో కృపాభాయి, క్వాలిటీ మేనేజర్ అనిల్, వైద్యులు అరుణ, అశోక్, ఆదిశ్‌రెడ్డి, శ్రీలత, శిరీష ఉన్నారు.

తెలంగాణ ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష



ప్రాజెక్టు కంట్రోల్ రూం పరిశీలిస్తున్న డైరెక్టర్ భట్టాచార్య

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టులో సంస్థ డైరెక్టర్(ప్రాజెక్ట్స్) ఉజ్వల్ క్రాంతి భట్టాచార్య గురువారం పర్యటించారు. ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్, సీజీఎం ప్రసేంజిత్‌పాల్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. తెలంగాణ స్టేజీ–1లో నిర్మితమైన యూనిట్ 1, 2 బాయిలర్, యాష్ హ్యాండ్లింగ్ పురోగతిని సమీక్షించారు. డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) యూనిట్–2 కూలింగ్ టవర్ ఎంసీసీ గదిని ప్రారంభించి, ట్రాన్స్‌ఫార్మర్‌ను చార్జ్ చేశారు. స్విచ్ గేర్ కంట్రోల్ రూమ్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి తెలంగాణ ప్రాజెక్టు నిర్మాణ పురోగతిపై సమీక్షించారు. జ్యోతిభవన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వనరులను ధ్వంసం చేస్తున్న ప్రభుత్వం

- మావోయిస్టు పార్టీ జేఎంఎంపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్

మంథని: త్యాగాల ఫలితంగా ఏర్పడ్డ ప్రభుత్వం తెలంగాణలో ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు పోలీస్ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రతిపక్షాలు, ప్రజా ఉద్యమాలను కాలరాస్తోందని జయశంకర్–మహబూబాబాద్, వరంగల్, పెద్దపల్లి జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. అధికార పార్టీ రియల్ వ్యాపారుల లాభాల కోసం కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తీస్తున్నారని తెలిపారు. మిడ్‌మానేరులో ఇసుకను తీయడంతో నీటి ఎద్దడి ఏర్పడి పంటలు పండవని కేసు వేసిన తర్వాత మైనింగ్ ఆపేసిందని పేర్కొన్నారు. అధికార పార్టీ అండదండలతో సుల్తానాబాద్, వీణవంక నుంచి గోదావరి కలిసే వరకు ఇసుకను తీసి అమ్ముతున్నారని తెలిపారు. కాళేశ్వరం దగ్గర గోదావరిలో అక్రమంగా రోడ్డు పోసి ఇసుకను తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. పెద్దపల్లి, జయశంకర్, ములుగు అడవులు, గుట్టలు, చెరువుశిఖం భూముల్లోని మట్టి తీసి రోడ్లు, ప్రభుత్వ భవనాలు, ఇళ్ల నిర్మాణానికి అనుమతుల్లేకుండా కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదిస్తూ ప్రకృతిని ధ్వంసం చేస్తున్నారని స్పష్టం చేశారు.

ఉత్తమ ఐసీటీసీ సెంటర్‌గా గుర్తింపు



కోల్‌సిటీ(రామగుండం): రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లోని ఐసీటీసీ కేంద్రానికి ఉత్తమ సెంటర్‌గా గుర్తింపు లభించింది. ఈమేరకు ఐసీటీసీ సిబ్బందికి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్‌సింగ్ గురువారం సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ పత్రాన్ని అందజేసి అభినందించారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(నాకో), తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(టీసాక్స్) గైడ్‌లైన్స్ ప్రకారం.. రామగుండం జీజీహెచ్‌లోని ఐసీటీసీ సెంటర్ చక్కటి నాణ్యత ప్రమాణాలు పాటించినందుకు ఫైవ్‌స్టార్ రేటింగ్ గుర్తింపు వచ్చిందని కొనియాడారు. గత నాలుగేళ్లుగా ఐసీటీసీ సెంటర్ పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాల ఫలితంగా గుర్తింపు దక్కిందన్నారు. ఇందుకు కృషి చేసిన ఐసీటీసీ ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ అరుణ, ఆర్‌ఎంవో అప్పారావు, ల్యాబ్ టెక్నీషియన్ టి.శ్రీనివాస్, కౌన్సిలర్లు కట్కూరి శంకర్, ఎ.విజయలను సూపరింటెండెంట్ అభినందించారు.

హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్‌లో ప్రవేశాలకు డ్రా



పెద్దపల్లిరూరల్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతిలో ప్రవేశాలకు గురువారం డ్రా పద్ధతిన ఎంపిక చేసినట్లు అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి 14 దరఖాస్తులు అందాయన్నారు. మంథని మండలం పుట్టపాకకు చెందిన గడ్డం గౌతంనంద, ధర్మారం మండలం కానంపల్లికి చెందిన రెడపాక హన్వితశ్రీ ఎంపికైనట్లు తెలిపారు. గోదావరిఖనికి చెందిన సాయిఅర్పిత్, సుల్తానాబాద్ మండలం గట్టిపల్లికి చెందిన గుండేటి నయన్‌ను వెయిటింగ్ లిస్టులో ఉంచామన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మధుసూదన్‌శర్మ, మైనార్టీ సంక్షేమాధికారి మెహరాజ్, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ నాగలేశ్వర్, విజయపాల్‌రెడ్డి ఉన్నారు.

జీజీహెచ్‌కు కార్పొరేట్ కళ

- పూర్తయిన 85 పడకల కొత్త బ్లాక్
- వినియోగంలోకి రానున్న సీటీస్కాన్
- నేడు ప్రారంభం



కొత్త బ్లాక్‌లో ఏర్పాటు చేసిన పడకలు



కొత్తగా ఏర్పాటు చేసిన సీటీ స్కానింగ్ యంత్రం

కోల్‌సిటీ(రామగుండం): అధునాతన బెడ్లు.. అత్యాధునిక పరికరాలతో గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయ్యింది. మెడికల్ కాలేజీకి అనుబంధంగా జీజీహెచ్ ఆస్పత్రిని 330 పడకల సామర్థ్యంతో అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆస్పత్రి ఆవరణలో అదనంగా నిర్మించిన 85 పడకల కొత్త బ్లాక్‌తోపాటు కొత్తగా ఏర్పాటు చేసిన సీటీస్కాన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రారంభించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ తెలిపారు. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

రూ.4.5కోట్లతో 85 పడకల కొత్త బ్లాక్

రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి జీజీహెచ్ ఆస్పత్రిని ఉపయోగించుకుంటున్నారు. జీజీహెచ్‌కు 330 పడకల సామర్థ్యం అవసరం కావడంతో, ఆస్పత్రిలో ఇప్పటికే 245 పడకలు ఉన్నాయి. మరో 85 పడకల కొత్తబ్లాక్‌ను ఆస్పత్రి ఆవరణలోని బ్లడ్‌బ్యాంక్ ముందు ఏర్పాటు చేశారు. ఇటీవల డీఎంఈ రమేశ్‌రెడ్డి తనిఖీ చేశారు.

అన్ని సేవలు కొత్త బ్లాక్‌లోనే..

85 పడకల కొత్త బ్లాక్‌లో మెడికల్, ఆప్తమాలజీ, సర్జికల్, డెర్మటాలజీ, సైకియాట్రిక్, ఈఎన్‌టీ, పల్మనాలజీ తదితర ఓపీ విభాగాల సేవలతోపాటు ఫార్మసీ విభాగాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. అవసరమైన పడకలను ఏర్పాటు చేశారు. ఓపీల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా రిసెప్షన్‌ను ఆధునీకరించారు. గైనకాలజీ, పిడియాట్రిక్ సేవలను మాత్రం పాత భవనంలోనే అందించనున్నారు.

రూ.2.57కోట్లతో సీటీ స్కాన్

జీజీహెచ్ ఆస్పత్రిలో తొలిసారిగా సీటీస్కానింగ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఐదు నెలల క్రితం సీటీస్కానింగ్ యంత్రాన్ని సుమారు రూ.2.57 కోట్లతో సింగరేణి సంస్థ ఏర్పాటు చేసింది. ఈ సీటీస్కానింగ్ యంత్రంపై పనిచేయడానికి ప్రస్తుతం ఆస్పత్రిలోని టెక్నీషియన్లకు శిక్షణ ఇప్పించారు.

క్లుప్తంగా

చీఫ్ విప్ పరామర్శ



నివాళి అర్పిస్తున్న విప్ భానుప్రసాద్‌రావు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలంలోని నారాయణాపూర్ ఉపసర్పంచ్ ఎరవెళ్లి రామారావు తండ్రి తిరుపతిరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. చీఫ్‌విప్, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు గురువారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు వేణుగోపాల్‌రావు, మూల హరీశ్, జూపెల్లి రాజేశ్వర్‌రావు, ఫక్కీర్‌యాదవ్ తదితరులున్నారు.

కుట్టుశిక్షణతో ఉపాధి పొందాలి



మహిళలతో మాట్లాడుతున్న రజని

జ్యోతినగర్(రామగుండం): ఉచిత కుట్టుశిక్షణతో మహిళలు మహిళలు ఉపాధి పొందాలని డిస్ట్రిక్ట్ మిషన్ కో–ఆర్డినేటర్ రజని అన్నారు. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ అన్నపూర్ణకాలనీ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. మహిళలు తమ ఖాళీ సమయాన్ని వృథా చేసుకోకుండా స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొంది, ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కుట్టుశిక్షణ పొందుతున్న మహిళలను ఆమె అభినందించారు. కార్యక్రమంలో శ్వేత, శ్యాం, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రామగుండంవాసి మృతదేహం లభ్యం



వెంకటేశ్వర్లు (ఫైల్)

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ బస్టాండ్ సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద గురువారం ఓ వ్యక్తి మృతదేహం లభించింది. బసంత్‌నగర్ ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే బ్రిడ్జి వద్ద కుళ్లిన మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు దాదాపు 15 రోజుల క్రితమే మరణించినట్లుగా ఉందని, అక్కడ లభించిన ఆధారాలనుబట్టి రామగుండంకు చెందిన బండి వెంకటేశ్వర్లుగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. వెంకటేశ్వర్లు కొన్నేళ్లుగా భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడని, ఎండదెబ్బ కారణంగా చనిపోయి ఉంటాడని పేర్కొన్నారు. పంచనామా నిర్వహించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతుని సంబంధీకులు ఎవరైనా ఉంటే బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

7న తెలంగాణ భరోసా సభకు రండి

- బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దాసరి హన్మయ్య



బీఎస్పీలో చేరిన మహిళలు

ఓదెల(పెద్దపల్లి): బహుజనులు బీఎస్పీ వైపు చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దాసరి హన్మయ్య అన్నారు. గురువారం ఓదెల మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన 50 మంది మహిళలు బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ భరోసా సభకు తరలివచ్చి, విజయవంతం చేయాలని కోరారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు కల్యాణ మహేశ్, కాసర్ల శ్రీనివాస్, ఎండీ.వాహీద్, దాసరి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

కనగర్తి బూత్ కమిటీ ఎన్నిక

బీఎస్పీ కనగర్తి బూత్ కమిటీని ఎన్నుకున్నారు. మహిళా అధ్యక్షురాలిగా పిట్టల తిరుమల, ఉపాధ్యక్షురాలిగా తూడి కవిత, ప్రధాన కార్యదర్శులుగా పిట్టల భాగ్య, పిట్టల స్వప్న, ఇలవేని స్వరూప ఎన్నికై నట్లు హన్మయ్య తెలిపారు.

15 నుంచి పల్లెల్లో క్రీడా పండుగ

- చీఫ్ మినిస్టర్స్ కప్–2023 పేరిట పోటీలు
- మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు..
- నిర్వహణకు నిధులు, కమిటీలు
- 15 నుంచి 36 ఏళ్ల వయసువారు అర్హులు



మల్కాపూర్‌లో జరిగిన కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు (ఫైల్)

కరీంనగర్ స్పోర్ట్స్: చాలా ఏళ్ల తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా సంబరం నెలకొననుంది. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం చీఫ్ మినిస్టర్స్ కప్–2023 పేరిట క్రీడా పండుగకు శ్రీకారం చుట్టారు. పోటీల నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవలే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్ సంబంధిత ఫైలుపై తొలి సంతకం చేశారు. అనంతరం పోటీల నోటిఫికేషన్ విడుదలైంది. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడలు సజావుగా సాగేందుకు కమిటీలను వేసి, నిధులు సైతం విడుదల చేశారు. 15 నుంచి 36 ఏళ్ల వయసువారు అర్హులు.

మండల స్థాయిలో 5 క్రీడాంశాలు..

మండల స్థాయిలో జరిగే పోటీలకు ఎంపీపీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఎంపీడీవో మెంబర్ కన్వీనర్‌గా, జెడ్పీటీసీ, తహసీల్దార్, ఎంఈవో లేదా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఎస్సై, మున్సిపల్ కమిషనర్, పీడీ లేదా పీఈటీలు సభ్యులుగా వ్యవహరిస్తారు. పోటీల నిర్వహణకుగాను రూ.15 వేలు మంజూరు చేశారు. 5 క్రీడాంశాల్లో పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, పురుషులకు ఫుట్‌బాల్ పోటీలు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు జరగనున్నాయి.

జిల్లా స్థాయిలో 11..

జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు చైర్మన్‌గా కలెక్టర్, వైస్ చైర్మన్‌గా ఐపీఎస్ అధికారి, కో–వైస్ చైర్మన్‌గా అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీ), కన్వీనర్‌గా జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి, సభ్యులుగా ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, డీఈవో, ఇండస్ట్రీస్ జీఎం, మున్సిపల్ కమిషనర్ వ్యవహరిస్తారు. పోటీల నిర్వహణకు రూ.75 వేలు మంజూరయ్యాయి. 11 క్రీడాంశాల్లో పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్‌తో పాటు పురుషులకు ఫుట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్ పోటీలు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరగనున్నాయి.

రాష్ట్ర స్థాయిలో 18..

రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాశాఖ మంత్రి చైర్మన్‌గా, శాట్స్ చైర్మన్ కో–చైర్మన్‌గా, ప్రిన్సిపల్ సెక్రటరీ వైస్ చైర్మన్‌గా, శాట్స్ ఎండీ కన్వీనర్‌గా, తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షులు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, కమిషనర్ మున్సిపల్, కమిషనర్ పంచాయతీరాజ్, కమిషనర్ జీహెచ్‌ఎంసీ, డిప్యూటీ డైరెక్టర్లు సభ్యులుగా వ్యవహరిస్తారు. 18 క్రీడాంశాల్లో పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, ఆర్చరీ, జిమ్నాస్టిక్స్, లాన్ టెన్నిస్, షూటింగ్, టేబుల్‌టెన్నిస్‌తోపాటు పురుషులకు ఫుట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్, హాకీ, వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు జరగనున్నాయి.

నగదు బహుమతి..

రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతి ఇవ్వనున్నారు. వ్యక్తిగత విభాగంలో మొదటి స్థానానికి రూ.20 వేలు, ద్వితీయ స్థానానికి రూ.15 వేలు, తృతీయ స్థానానికి రూ.10 వేలు ఇస్తారు. టీం విభాగంలో మొదటి స్థానానికి రూ.లక్ష, ద్వితీయ స్థానానికి రూ.75 వేలు, తృతీయ స్థానానికి రూ.50 వేలు ఇవ్వనున్నారు.

గ్రామీణ క్రీడాకారులకు వరం



సీఎం కప్ క్రీడా పోటీలు గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు వరం. రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మండల, జిల్లా స్థాయిలో క్రీడలను పకడ్బందీగా నిర్వహిస్తాం. ఇక్కడ రాణించిన క్రీడాకారులకు భవిష్యత్‌లో మంచి అవకాశాలు లభిస్తాయి.

– కీర్తి రాజవీరు, డీవైఎస్‌వో, కరీంనగర్, చీఫ్ మినిస్టర్స్ కప్ కన్వీనర్

యువత సద్వినియోగం చేసుకోవాలి



పల్లె క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉంది. వేసవి సెలవుల్లో క్రీడా సందడి మొదలుకానుంది. యువత ఈ పోటీలను సద్వినియోగం చేసుకోవాలి.

– నందెల్లి మహిపాల్, ఒలింపిక్ సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, కప్ నిర్వాహక సభ్యుడు

విజయదుందుబి మోగించాలి



చాలా రోజుల తర్వాత గ్రామీణ స్థాయి నుంచి జరుగుతున్న క్రీడా పోటీలతో పల్లెల్లో క్రీడా పండుగ వాతావరణం నెలకొననుంది. క్రీడాకారులు మండల, జిల్లా స్థాయి పోటీలను సద్వినియోగం చేసుకోవాలి. రాష్ట్రస్థాయిలో విజయదుందుబి మోగించాలి.

– గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఒలింపిక్ సంఘం కరీంనగర్ జిల్లా కార్యదర్శి, కప్ నిర్వాహక సభ్యుడు

అమ్మానాన్న మాట్లాడటం లేదని..

- మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య



అన్నపూర్ణ (ఫైల్)

రామగుండం: అమ్మానాన్న తనతో మాట్లాడటం లేదని మనస్తాపం చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. రామగుండం ఎస్సై శరణ్య తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాలపల్లికి చెందిన బందారపు శ్రీనివాస్–అన్నపూర్ణ(43) దంపతుల కూతురు వివాహం ఏడాది క్రితం జరిగింది. పెళ్లిలో అన్నపూర్ణ అత్తింటివారికి, తల్లిగారింటివారికి గొడవ జరిగింది. అప్పటినుంచి అన్నపూర్ణ తల్లిదండ్రులు ఆమెతో మాట్లాడటం మానేశారు. ఈ విషయంలో ఆమె తీవ్ర మనోవేదనకు గురవుతోంది. ఈ క్రమంలో వారం రోజుల క్రితం అన్నపూర్ణ కూతురుకు బాబు జన్మించగా భర్త తరఫు బంధువులు వచ్చారు. తల్లిగారింటి నుంచి ఎవరూ రాకపోగా కనీసం ఫోన్‌లోనూ మాట్లాడలేదు. దీంతో మనస్తాపం చెందిన అన్నపూర్ణ బుధవారం అర్ధరాత్రి ఇంటి పక్కనే ఉన్న బావిలో దూకి, ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని ఇందిరానగర్ వద్ద రాజీవ్ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎల్ఎండీ ఏఎస్సై నజీమొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్న గంట పవన్‌కుమార్ అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడిపి ద్విచక్రవాహనంపై వెళ్తున్న కరీంనగర్ ముకరంపురకు చెందిన మీర్జా హఫీజ్ అలీ బేగ్(56)ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుని భార్య షాహిన్ మీర్జా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు ఏఎస్సై పేర్కొన్నారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

- ఆర్జీ–2 జీఎం మనోహర్



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): ఎన్నో వ్యయప్రయాసలకోర్చి సింగరేణి యాజమాన్యం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ అన్నారు. ఉచిత శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని పేర్కొన్నారు. నిష్ణాతులైన శిక్షకులచే ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ ఆటల్లో 25 రోజులపాటు ప్రత్యేక శిక్షణనిస్తున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులు, పరిసర, ప్రభావిత గ్రామాల పిల్లలు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, ఎస్‌వోటూ జీఎం అబ్దుల్‌సలీం, డీజీఎం పర్సనల్ జి.రాజేంద్రప్రసాద్, సీనియర్ సెక్యూరిటీ అధికారి పీవీ రమణ, క్రీడా కార్యదర్శి వేణుగోపాల్, బెక్కం రవి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని మల్యాల జెడ్పీ హైస్కూల్లో 2006–07 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివినవారు గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి వారు చదువుకున్న పాఠశాల వేదికైంది. చిన్ననాటి మిత్రులను ఇన్నేళ్ల తర్వాత చూసి, ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తరగతి గది జ్ఞాపకాలను గుర్తు చేసుకొని, సంతోషం వ్యక్తం చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అందరూ కలిసి భోజనం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో సర్పంచు లంక రాజేశ్వరి, ఎంపీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సదయ్య, ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, రమేశ్, మల్లయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనాథ్, మధు, ప్రమోద్‌కుమార్, శ్రీనివాస్, స్రవంతి, సబిత, మహేందర్ రెడ్డి, రాజేశ్వర్‌రావు, శ్యాంసుందర్ రెడ్డి, మధుసూదన్, పూర్వ విద్యార్థులు జ్ఞానేంద్రాచారి, రాజేందర్, మునేశ్, జ్యోత్స్న, ఉమాదేవి, శిరీష, సమత, మమత, రజిత, పద్మ, శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వేతన ఒప్పందానికి కృషి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



గోదావరిఖని(రామగుండం): బొగ్గు గని కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందానికి తమ యూనియన్ కృషి చేస్తోందని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. గురువారం జీడీకే–2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కనీస వేతన ఒప్పందం పూర్తయిందని, అలవెన్స్‌లపై చర్చలు సాగుతున్నాయని తెలిపారు. వేతన ఒప్పందం విషయంలో కోలిండియా యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. అండర్ గ్రౌండ్ అలవెన్స్, స్పెషల్ అలవెన్స్, హెచ్‌ఆర్‌ఏ, ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ పెరగనున్నాయని, ట్రాన్స్‌పోర్టు, సబ్సిడీ, నైట్‌షిఫ్ట్ అలవెన్సులపై రాబోయే సమావేశంలో చర్చించనున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణి సంస్థకు రావాల్సిన విద్యుత్, బొగ్గు బకాయిలు రూ.25 వేల కోట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సంస్థ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల హరిణ్, మాదాసు రవీందర్, పెంచాల వెంకటస్వామి, జెల్ల తిరుపతి, ఎల్లావుల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలరాజుపల్లెలో అధికారుల పర్యటన



మరుగుదొడ్డిని పరిశీలిస్తున్న అధికారులు

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని బాలరాజుపల్లెలో మండల స్థాయి పీర్ వెరిఫికేషన్ అధికారులు గురువారం పర్యటించారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, ఎంపీవో కిరణ్, ఏపీఎం సదానందం, జూలపల్లి పంచాయతీ కార్యదర్శి లచ్చయ్యలతో కలిసి గ్రామంలో 2023కిగాను సెల్ఫ్ అసెస్‌మెంట్ వివరాలపై ఆరా తీసి, ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. అధికారులు అబ్బాపూర్, బాలరాజుపల్లె గ్రామాల్లో రెండు రోజులు పర్యటించి, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. మిగతా గ్రామాల్లోనూ పర్యటించి, వివరాలు సేకరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంటూరి రాజయ్య, పంచాయతీ కార్యదర్శి రవి, వీఏవో, స్వశక్తి సంఘం మహిళలు పాల్గొన్నారు.

ఒకసారి హై.. మరోసారి లోఓల్టేజ్

- మల్కాపూర్‌తోపాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా తీరు
- దగ్ధమవుతున్న గృహోపకరణాలు
- ఆర్థికంగా నష్టపోతున్న వినియోగదారులు
- అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన



240కి బదులు 271 ఓల్ట్స్ విద్యుత్ చూపిస్తున్న మీటరు

జ్యోతినగర్(రామగుండం): విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ కొందరి చర్యల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్‌తోపాటు పలు ప్రాంతాల్లో ఓసారి హైఓల్టేజ్, మరోసారి లోఓల్టేజ్ విద్యుత్ సరఫరా జరుగుతోంది. ఫలితంగా వినియోగదారుల ఇళ్లలోని గృహోపకరణాలు పనిచేయకుండా పోతున్నాయి. తాము ఓవైపు కరెంటు చార్జీలు చెల్లిస్తూ మరోవైపు పరికరాలకు మరమ్మతు చేయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 240 ఓల్ట్స్ విద్యుత్ సరఫరా కావాల్సి ఉండగా 271 ఓల్ట్స్ అవుతుండటంతో గృహోపకరణాలు కాలి పోతున్నాయని వాపోతున్నారు. విద్యుత్ సరఫరాలో సమస్యను పరిష్కరించాలని గ్రామానికి చెందిన కొంతమంది విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించారు. ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలి..

మల్కాపూర్‌లో విద్యుత్ లోడ్ అధికంగా ఉండటం వల్ల 100 కేవీ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రశాంత్‌నగర్, శ్రీనగర్ కాలనీ, మల్కాపూర్ గ్రామాల్లో 11 కేవీ వి ద్యుత్ తీగలు ఇళ్లపై ఉన్నాయని, విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని తొలగించడంతోపాటు లోఓల్టేజ్, హైఓల్టేజ్ సమస్యలను తీర్చి, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలని వేడుకుంటున్నారు.

సమస్య పరిష్కరించాలి..



హైఓల్టేజ్, లోఓల్టేజ్ కరెంటు సరఫరా అవుతుండటంతో ఇంట్లో ఉన్న ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు కాలిపోతున్నాయి. వినియోగదారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. నెలనెలా బిల్లులు తీసుకుంటున్న విద్యుత్ విభాగంవారు విద్యుత్ సరఫరాలో సమస్యలను పరిష్కరించాలి.

– సురేశ్, మల్కాపూర్

విన్నవించినా ఫలితం లేదు



విద్యుత్ సరఫరాలో సమస్యలను పరిష్కరించాలని విన్నవించినా ఫలితం లేకపోయింది. అధికారులపై రాజకీయ ఒత్తిడి ఉండవచ్చేమోనన్న అనుమానం కలుగుతోంది. ఏదేమైనా విద్యుత్ వినియోగదారుల సమస్యలు తీర్చాల్సిన బాధ్యత వారిపై ఉంది.

– ఎండీ.రహీం, కాంగ్రెస్ నాయకుడు

వినియోగించిన కార్లకే బిల్లుల చెల్లింపు

- రామగుండం మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలో అధికారులు లేనప్పుడు కార్లను అద్దెకు తీసుకోవడం లేదని, కేవలం అధికారులు ఉపయోగించిన కార్లకే బిల్లులు చెల్లిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు తెలిపారు. ఈ నెల 2న »సార్లు లేని కార్లకు బిల్లులు« అనే శీర్షికను »సాక్షి« దినపత్రికలో కథనం ప్రచురితమవగా గురువారం ఆయన వివరణ ఇచ్చారు. అద్దె వాహనాల అగ్రిమెంట్ కాల పరిమితి మార్చి 31తో ముగిసిన నేపథ్యంలో మరో సంవత్సర కాలానికి ఈవోఐ పిలిచినప్పటికీ పూర్తిస్థాయిలో దరఖాస్తులు రాలేదన్నారు. దీంతో మరోసారి ఈవోఐ పిలవాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు. ఇందుకు సమయం సరిపోకపోవడంతో ఏప్రిల్, మే రెండు నెలలకు ఇదివరకే ఉన్న అగ్రిమెంట్‌ను పొడిగించేందుకు పరిపాలనా అనుమతుల మంజూరు కోసం ఈ నెల 2న జరిగిన సాధారణ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు వెల్లడించారు. అవసరార్థం 12 కార్లను అద్దె ప్రాతిపదికన వాడుకోవడానికి పరిపాలనా మంజూరు తీసుకుంటున్నప్పటికీ ఉపయోగించుకుంటున్న 8 కార్లకు మాత్రమే బిల్లులు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. లేని అధికారులకు వాహనాలను ఉపయోగించుకోవడం లేదన్నారు. టీపీవో అధికారులు వారంలో కొద్ది రోజులు మాత్రమే స్థానికంగా విధులు నిర్వహిస్తున్నందున తక్కువ సమయంలో ఎక్కువ ప్రాంతాలను సందర్శించేందుకు ఏసీపీకి కేటాయించిన కారును వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. శానిటేషన్ అధికారులకు పెట్రోల్ అలవెన్స్ ఇస్తున్న నేపథ్యంలో సాధారణ విధుల నిర్వహణకు మున్సిపల్ వాహనాలు ఉపయోగించడం లేదన్నారు. కొన్ని సందర్భాలలో మాత్రమే మున్సిపల్ వాహనాలు వాడుకుంటున్నారని చెప్పారు. అలాగే అద్దెకు తీసుకున్న వాహనాలను వ్యక్తిగత టూర్లకు ఉపయోగిండం లేదని, అలాంటి విషయమేదైనా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యలపై సమాచారం ఇవ్వండి



అవగాహన కల్పిస్తున్న డీఈ తిరుపతి

ఎలిగేడు(పెద్దపల్లి): విద్యుత్ సమస్యలపై సమాచారం ఇవ్వాలని, విద్యుత్‌ను పొదుపుగా వాడాలని డీఈ తిరుపతి అన్నారు. గురువారం ఎలిగేడు మండలంలోని ధూళికట్టలో విద్యుత్ వారోత్సవాల్లో భాగంగా జీపీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. గ్రామస్తులకు విద్యుత్ భద్రత, పొదుపుపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో తెగిపడిన విద్యుత్ తీగలు, వర్షాలకు విరిగిపడిన స్తంభాలను ముట్టకోవద్దని, వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందిస్తే వాటిని సరిచేస్తారని చెప్పారు. అనుమతి లేని వ్యక్తులు వినియోగదారుల డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లకు ఫ్యూజ్‌లు మార్చడం, సర్వీసు వైర్లు, స్ట్రీట్ లైట్లను సరిచేయడం వంటి కారణాల వల్ల విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇళ్లలో కంపాక్టు ఫ్లోరోసెంట్ బల్బులను వాడాలన్నారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో లైట్లు, ఫ్యాన్లు ఆఫ్ చేయాలని, ఎలక్ట్రికల్ వాటర్ హీటర్, గీసర్‌కు బదులుగా సోలార్ వాటర్ హీటర్లను వాడాలని చెప్పారు. ఒక్కోరోజు ఒక్క యూనిట్‌ను ఆదా చేస్తే జీవిత కాలంలో రూ.లక్ష పొదుపు చేసినవారవుతారని అన్నారు. రైతులు విద్యుత్ అధికారుల సలహాలు, సూచనల మేరకు పంపుసెట్లు, కెపాసిటర్లు బిగించుకొని, విద్యుత్‌ను ఆదా చేయడంతోపాటు ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కావేరి, విద్యుత్ ఏడీ వెంకటేశ్వర్లు, ఏఈ సంపత్‌రెడ్డి, లైన్‌మెన్ భాస్కర్, జేఎల్ఎం రాజేందర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొల్లె భూమేశ్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.